

నాడు శిథిలం.. నేడు సుందరం

అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారు. బడి–**గుడి అనే తేడా** లేకుండా.. అన్నింటికీ కొత్త రూపునిస్తూ.. ప్రజలు కోరిందే చేస్తాననంటూ **అభయం** అందిస్తున్నారు. అందుకు ఉదాహరణే జీవీఎంసీ 58వ వార్డులో గల **ములగాడ,** ఎదురుపాలెం గ్రామాల్లో గల శిథిల శ్మశాన వాటికలు. ఒకప్పుడు **అవి తుప్పలు,** పిచ్చిమొక్కలతో మనుషులు ప్రవేశించడానికి కూడా అనువుగా ఉం**డేవి కాదు.** అలాంటిది ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చొరవతో శ్మశానాల్లా కాదు.. పార్కుల్లా ఆధు**నికత** సంతరించుకున్నాయి.


కొత్తగా నిర్మించిన గది

- 58వ వార్డులో శ్మశాన **వాటికలకు** కొత్తరూపు
- పార్కులను తలపించేలా అభివృద్ధి
- రూ.39 లక్షలతో సకల సౌకర్యాలతో ఆధునికీకరణ
- ప్రభుత్వానికి స్థానికుల కృతజ్ఞతలు

మల్కాపురం: ప్రశాంతమైన వాతావరణంలో అంత్యక్రియలు జరుపుకునేలా శ్మశాన వాటికలను తీర్చిదిద్దారు. 58వ వార్డులో పేరుకు రెండు శ్మశాన వాటికలున్నా అవి ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి. పందుల సంచారం, తుప్పలు పెరిగి కారడవిలా తయారయ్యాయి. దీంతో ఆయా ప్రాంత ప్రజలు ఎవరైనా చనిపోతే రెండు కిలోమీటర్ల దూరంలో గల కోరమాండల్ వద్ద గల శ్మశాన వాటికకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది గత చరిత్ర అయితే నేడు పార్కులను తలపించే విధంగా ఆయా ప్రాంతాల్లో గల రెండు శ్మశాన వాటికలను సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, అభివృద్ధికి తోడ్పడిన ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఆయా ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

నాటి దుస్థితి ఇదీ..

జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామంలో 40 ఏళ్ల నుండి ఓ శ్మశానం ఉండేది. అయితే దీని ఆలనా పాలనా చూసే నాథుడు లేకపోవటంతో అధ్వానంగా మారింది. దీంతో ఈ గ్రామంలో ఎవరు చనిపోయినా దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇటీవల ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే వార్డు కార్పొరేటర్ లావణ్య, గ్రామస్తులతో కలిసి శ్మశానం అంతా పరిశీలించి వెంటనే అధికారులతో మాట్లాడారు. సుమారు రూ. 15 లక్షలతో శ్మశానాన్ని ఆధునికీకరించారు.

- వార్డులోని ఎదురువానిపాలెం శ్మశాన వాటికదీ ఇదే పరిస్థితి. ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు గ్రామస్తుల ద్వారా సమస్య తెలుసుకున్న ఆడారి ఆనంద్‌కుమార్ అధికారులతో మాట్లాడి రూ. 24 లక్షల ఖర్చుతో శ్మశానాన్ని ఆధునికీకరించారు. దీంతో గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.


ఎదురువానిపాలెం శ్మశాన వాటిక ముఖద్వారం


అందంగా ఎదురువానిపాలెం శ్మశాన వాటిక ఆవరణ


ములగాడ శ్మశాన వాటికి ముఖద్వారం


ములగాడ శ్మశాన వాటిక ఆవరణ

చాలా అధ్వానంగా ఉండేది..



ములగాడలో గల శ్మశాన వాటికి ఒకనాడు అధ్వానంగా ఉండేది. ఆడారి ఆనంద్‌కుమార్ చొరవతో పార్కును తలపించేలా ఇప్పుడు తయారయింది. ప్రజా సమస్యల పట్ల వెంటనే స్పందించే సీఎం జగన్ ప్రభుత్వానికి, స్థానిక నేత ఆడారి ఆనంద్‌కుమార్‌కు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– పెద్దాడ వెంకటరమణ, ములగాడ గ్రామ పెద్ద

నాడు ఎవరూ స్పందించలేదు..



ఎదురువానిపాలెం శ్మశాన వాటిక అధ్వానంగా మనుషులు వెళ్లలేని విధంగా ఉండేది. దీనిపై గత పాలకులకు వివరించినా స్పందించలేదు. కానీ మా ప్రాంతానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఆడారి ఆనంద్‌కుమార్‌కు సమస్య వివరించగానే వెంటనే స్పందించి ఆధునికీకరించారు.

– ఏదుర రాజు, వెదురువానిపాలెం గ్రామ ఉపాధ్యక్షుడు

రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది..



ఎదురువానిపాలెంలో ఎవరు చనిపోయినా రెండు కిలోమీటర్ల దూరం తీసుకెళ్లాల్సి వచ్చేది. ఆడారి ఆనంద్‌కుమార్ మా సమస్యను గుర్తించి గ్రామంలోని శ్మశాన వాటికను ఆధునికీకరించారు. ఆయనకు కృతజ్ఞతలు.

– యలమంచిలి కృష్ణవేణి, వెదురువానిపాలెం

అందంగా తీర్చిదిద్దారు..



ఎదురువానిపాలెంలో గల శ్మశాన వాటికను రూ. 24 లక్షలతో ఆధునికీకరించి పార్కులా తీర్చిదిద్దారు. నాడు పిచ్చిమొక్కలతో ఉండే శ్మశానం నేడు పచ్చటి మొక్కల మధ్య సుందరంగా రూపొందింది. చాలా సంతోషంగా ఉంది.

– బాబ్జి, వెదురువానిపాలెం గ్రామ ఆర్గనైజింగ్ సెక్రటరీ

క్లుప్తంగా

జోరుగా సీసీ రోడ్డు పనులు


శ్రీరామ్‌నగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు పిక్క తేలి ఉండేది. దీంతో వాహనదారులు,పాదచారులు ఇబ్బందులకు గురయ్యేవారు. ఇటీవల ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు కాలనీ వాసులు రోడ్డు దుస్థితిని చూపించారు.దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి కొత్తగా సీసీ రోడ్డు వేసే పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పించండి


ఎల్ అండ్ టీ అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పత్నిరావు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనుల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి శరగడం పత్నిరావు ఎల్ అండ్ టీ అధికారులను కోరారు.స్థానిక నిరుద్యోగులతో కలిసి ఆయన శనివారం విస్తరణ పనులు చేపడుతున్న ప్రాంతానికి వెళ్లి ఎల్ అండ్ టీ అధికారులతో మాట్లాడారు. స్థానిక వాసులకు అవకాశాలు కల్పించాలని ఆదేశించినా పట్టనట్టు వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించారు. తమ డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.దీనిపై ఎల్ అండ్ టీ అధికారులు సానుకూలంగా స్పందించారని పత్నిరావు వివరించారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

మర్రిపాలెం: సింహాచలం రైల్వే స్టేషన్ పరిధిలో పట్టాలపై గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు గుర్తుంచారు. వారు తెలిపిన వివరాలిలా.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు, 5.2 అడుగుల ఎత్తు కలిగి చాయనఛాయ రంగులో ఉన్న వ్యక్తి నలుపు రంగు ఫ్యాంట్ ధరించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌భాస్కర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 0891–2881910, 98481 68309 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

నేడు క్రికెట్ లీగ్ ఫైనల్ మ్యాచ్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న జగనన్న విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జింక్ గ్రౌండ్‌లో జరుగుతుంది. విజేతలకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ బహుమతులు, కప్ ప్రదానం చేయనున్నారు. అలాగే ఉదయం 8 గంటలకు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు వార్డు అధ్యక్షులతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఉంటుందని ఆ పార్టీ పశ్చిమ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. 11గంటలకు ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీ మహా యజ్ఞం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని లలిత కళామందిర్ క్రీడామైదానంలో శనివారం సాయంత్రం 6 గంటలకు గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభమైంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు 51 కలశాలతో 17వ గాయత్రీ మహా యజ్ఞం పూజ్య గురువులు మాతా భగవతి దేవీశర్మ ఆధ్వర్యంలో కొనసాగనుంది. ఈ మేరకు 51 కలశాలతో శనివారం సాయంత్రం మహిళలంతా కలశాలతో యాత్రగా బయలుదేరి యజ్ఞ ప్రాంగణానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సాహంగా పింఛన్ల పండగ


63వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న పిలక రామ్మోహనరెడ్డి తదితరులు


90వ వార్డులో పింఛన్ అందజేస్తున్న నమ్మి శ్రీను

సింధియా : జీవీఎంసీ 63వ వార్డులో పలువురు లబ్ధిదారులకు వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమం చేరువ చేయాలనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 90వ వార్డులో..

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డులో శనివారం కూడా సామాజిక పింఛన్ల పంపిణీ కొనసాగింది. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. బుచ్చిరాజుపాలెంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు నమ్మి శ్రీను సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందజేశారు.

యారాడ వెళ్లి...

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి దరి తుమ్మడపాలేనికి చెందిన చిత్త త్రినాథమ్మ కాలు విరగడంతో యారాడలో కుమార్తె ఇంటి వద్ద ఉంటుంది. విషయం తెలుసుకుని వలంటీర్ దుర్గాదేవి శనివారం యారాడ వెళ్లి త్రినాథమ్మకు రూ.3 వేల పింఛన్ అందజేశారు.


త్రినాథమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ దుర్గాదేవి

క్రీడాకారులకు 'ఆడుదాం ఆంధ్రా' కిట్ల పంపిణీ


కీడాకారులకు కిట్లు అందజేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం : ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా వార్డు, గ్రామ స్థాయిలో క్రీడాకారుల్ని వెలికి తీసేందుకు, వారిలో క్రీడాస్ఫూర్తి రగిలించేందుకు సీఎం జగన్ ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. ఇప్పటి వరకు సచివాలయం స్థాయిలో ఈ పోటీలు జరిగాయని, 10వ తేదీ నుంచి మండల స్థాయిలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, బూరెడ్డి గోపి, ఊటపల్లి గోవిందరావు, నీలాపు శ్రీనివాస రెడ్డి, తమ్మిరెడ్డి, కంపర సత్తిబాబు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆళ్ల ప్రమాణ స్వీకారం


పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజును సత్కరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, బెహరా తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89 వార్డులోని కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా ఆళ్ల పైడిరాజు ప్రమాణ స్వీకారం శనివారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త, ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆళ్ల పైడిరాజు చేత ప్రమాణ స్వీకారం చేయించి చైర్మన్ కుర్చీలో కూర్చొబెట్టి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కోర్టు వివాదాలతో ఎన్నో ఏళ్లుగా ఈ పీఏసీఎస్ మూతపడిందన్నారు. వివాదాలు సమసి పోవడంతో నూతన పాలకవర్గం ఏర్పాటైందని చెప్పారు. ఆళ్ల పైడిరాజు మంచి ఖ్యాతి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాల కృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, పలు వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, స్థానిక కుల సంఘాల నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన నాగమణి

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్‌లో శనివారం ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలపాలేనికి చెందిన శీలం నాగమణి(40) భర్త శ్రీనివాసరావుతో ద్విచక్రవాహనంపై రావులపాలెం వెళ్లేందుకు బయలుదేరారు. ఎన్ఏడీ జంక్షన్‌కు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైకు వెనుక కూర్చున్న నాగమణి లారీ చక్రాల కిందకు వెళ్లడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇగ్నో ప్రవేశాలు ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జనవరి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. https://ignouadmission. samarth. edu. in/ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

విశాఖ విద్య: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణఅన్నారు. సచివాలయ సిబ్బందితో కలిసి శనివారం వార్డు పరిధిలోని రజకకాలనీ, లక్ష్మీనగర్–ఎఫ్ బ్లాక్‌లో పర్యటించారు. కాలనీల్లో డ్రైనేజీలు సవ్యంగా లేవని ప్రజానీకం తెలిపిన మేరకు సచివాలయ సిబ్బందితో కలసి పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జీవీఎంసీ అధికారులను కోరారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు కిట్ల అందజేత


విజేతలకు క్రికెట్ కిట్ ఇస్తున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వార్డు స్థాయి విజేతలకు ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ క్రికెట్ కిట్‌లు అందజేశారు. ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీల్లో సచివాలయం జట్టు విజేతగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, సచివాలయ అడ్మిన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు గుర్తింపు కార్డులు

మార్కెటింగ్ అధికారి యాసిన్


రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న యాసిన్

విశాఖ విద్య: రైతు బజార్లలో దుకాణాలు నిర్వహించేందుకు అర్హులైన రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ అన్నారు. మర్రిపాలెం రైతు బజార్‌ను శనివారం సందర్శించారు. దుకాణాలు నిర్వహించే రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్లలో అర్హులైన రైతులతోనే దుకాణాలు నిర్వహించేలా దృష్టి సారించామన్నారు. జాయింట్ కలెక్టర్ సూచనలకు అనుగుణంగా రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులను గుర్తించినట్టు చెప్పారు. అర్హులైన వారికి గుర్తింపు కార్డులను రెన్యువల్ చేశామన్నారు. వినియోగదారులకు రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకే కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు అందించాలనేది లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రైతుబజారు ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి దాతృత్వం

- గోపాలపట్నం హైస్కూల్‌లో భోజన షెడ్ నిర్మాణం
- రూ. 6.5 లక్షలు వెచ్చించిన ఎన్‌ఆర్‌ఐ నగేష్‌కుమార్


భోజనశాలను ప్రారంభిస్తున్న దాత నగేష్ కుమార్ తల్లి పుష్పలత

గోపాలపట్నం: చదువుల తల్లి రుణాన్ని పూర్వ విద్యార్థి తీర్చుకున్నాడు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు భోజనం చేసేందుకు వసతి కల్పించారు. రేకుల షెడ్డుతో పాటు భోజనాలు చేసేందుకు బల్లలు నిర్మించారు. అంతే కాకుండా ఇక్కడి ప్రాంగణంలో ఉన్న స్టేజ్‌పై నూతన రేకులు వేశారు. ఉపాధ్యాయులకు కలపతో 20 కుర్చీలు చేయించారు. మొత్తంగా ఈ పనులకు రూ.6.5లక్షలు వెచ్చించారు. శనివారం సాయంత్రం దాత తల్లి పి. పుష్పలత భోజనశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పిల్లలు ఇదే పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై చిన్న చూపు మానుకోవాలన్నారు. చాలా మంది ఉన్నత స్థాయికి వెళ్లిన వారంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నవారేనని అన్నారు. తన కొడుకు ప్రస్తుతం అమెరికాలో ఉన్నాడని తెలిపారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ, శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వసతులు కల్పించారని వాటిని ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపధ్యాయుడు వేణుగోపాల్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి నగేష్ కుమార్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేను బ్యాక్ బెంచ్ స్టూడెంట్‌ని

మాజీ ఎమ్మెల్యే పల్లా


వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్

మల్కాపురం : తాను చదువుకున్న పాఠశాలలో జరిగే సిల్వర్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా రావటం సంతోషంగా ఉందనిమాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మల్కాపురం వద్ద గల సెయింట్ జోసెఫ్ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తను బ్యాక్ బెంచ్ స్టూడెంట్‌నని, అయినా చదువులో మాత్రం ఎప్పుడూ ఫస్ట్ అని వివరించారు. ఓ ప్రణాళిక ప్రకారం తన చదువు సాగిందన్నారు. అందుకే నేడు ఈ స్థాయిలో ఉన్నానని అక్కడి విద్యార్థులకు వివరించారు. టాలెంట్ గుర్తించి ఆ రంగంలో రాణిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

చురుగ్గా పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్,లేబర్ జంక్షన్,ఎక్స్‌సర్వీస్ మెన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ,సంపత్‌కుమార్ ఆయా ప్రాంతాల వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు రూ. 3వేలు చొప్పున పింఛన్‌లు అందించారు. రేవళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3 వేలకు పెంచారన్నారు. వచ్చే ఎన్నికల్లో అంతా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.